

అభ్యర్థులు అలర్ట్.. - 8లో▸

నేడు టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థులు ఉదయం 8గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సీపీ రంగనాథ్ తెలిపారు.



కేయూలో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

కేయూలో వివిధ విభాగాల పీహెచ్‌డీ పరిశోధకులకు శుక్రవారం ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం 30.0°/27.0°

వాతావరణం

జిల్లాలో పొడి వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

కదనభేరికి రెడీ!

నేడు కాకతీయుల గడ్డపైకి ప్రధాని నరేంద్ర మోదీ



హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ప్రధాని మోదీ పర్యటనకు సిద్ధం చేసిన నాలుగు వేదికలు

- కాజీపేట రైల్వే వ్యాగన్, వర్క్‌షాప్, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- అనంతరం విజయసంకల్ప సభ
- ఎన్నికల శంఖారావం పూరించే అవకాశం
- బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, మామునూరు ఎయిర్‌పోర్టుపై ఆశలు
- అడుగడుగునా పోలీసులు.. మూడంచెల భద్రత



సిద్ధమైన ప్రధానిమోదీ ప్రసంగించే వేదిక



వర్చువల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే వేదిక

సాక్షిప్రతినిధి, వరంగల్:

దేశ ప్రధాని నరేంద్రమోదీ కాకతీయుల గడ్డ నుంచి కదనభేరి మోగించనున్నారు. ప్రధానమంత్రిగా తొలిసారి శనివారం వరంగల్ మహానగరంలో పర్యటిస్తున్న ఆయన అధికార కార్యక్రమాల తర్వాత 'విజయ సంకల్పసభ'లో ప్రసంగించనున్నారు. చరిత్రాత్మక నగరంలో నిర్వహించే ఈసభ రాజకీయంగా కీలకం కానుందని ఇప్పటికే బీజేపీ జాతీయ నాయకులు ప్రకటించారు. ఈనేపథ్యంలో హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించే 'నమో' సభ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉదయం మామునూరు ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా చేరుకోనున్న ప్రధానమంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం తిరిగి మధ్యాహ్నం మామునూరు నుంచే హకీంపేటకు బయలుదేరుతారు. సుమారు 2.40 గంటల పాటు ఓరుగల్లులో ప్రధానమంత్రి గడపనుండగా.. ఆయనకు ఘనస్వాగతం మొదలు వీడ్కోలు పలికే వరకు కనీవినీ ఎరుగని రీతిలో పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కాలేజీ మైదానంలోని సభా వేదిక ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ నేతలు తరుణ్‌చుగ్, ఈటల రాజేందర్, బండి సంజయ్, డీకే అరుణ, జితేందర్‌రెడ్డితోపాటు జిల్లా నాయకులు పరిశీలించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తరుణ్‌చుగ్, కిషన్‌రెడ్డి, అరుణ

ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజీ మైదానంలో నాలుగు గుడారాలు..

ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో ఐరన్, స్టీల్‌తో నాలుగు పెద్ద గుడారాలు (వేదికలు) ఏర్పాటు చేశారు. ప్రధాన మంత్రి భద్రతా రీత్యా స్పెషల్ ప్రొటెక్షన్స్ గ్రూప్ (ఎస్పీజీ) పర్యవేక్షణలో గోదాం(షెడ్‌ల)ల వైశాల్యంతో నాలుగు నిర్మించారు. ప్రధాని కార్యక్రమంలో పాల్గొనే వారు ఒక చోట నుంచి ఒకచోటకు చేరకుండా.. ఎక్కడివారు అక్కడే ఉండే విధంగా భద్రతా చర్యల్లో భాగంగా ఈ ఏర్పాట్లను చేసినట్లు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. నాలుగు ఏర్పాటు చేసినప్పటికీ ప్రధాని ఒకే వేదిక నుంచి మాట్లాడతారని, మామునూరులో హెలికాప్టర్ దిగి... మళ్లీ తిరుగు పయనం అయ్యే వరకు ప్రతీది ఈ సభావేదికల వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా లైవ్‌గా వస్తుందని చెప్పారు.

- నాలుగింటిలో పూర్తిగా క్లోజ్ (మూసివేసిన) చేసిన ఒక గుడారంలో ప్రధాని మోదీ రైల్వే, నేషనల్ హైవే ఉన్నతాధికారులతో సమావేశమై వర్చువల్‌గా రూ.6,109 కోట్ల పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆ పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుంది.
- మూడింటిలో మధ్యలో ఉన్నది సభా వేదిక ప్రాంగణం... దానికి ఎడమ, కుడిగా ఉన్న షెడ్లలో గుర్తింపు పొందిన ప్రతినిధులు కూర్చోవడానికి వీలుంది. బారికేడ్ల బయట సభకు హాజరయ్యే జనం ఉంటారు.




మామునూరు ఎయిర్‌పోర్ట్‌లో భద్రత, ఇతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీజీ డీఐజీ నవనీత్ కుమార్, సీపీ రంగనాథ్, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య

ప్రధాని పర్యటన ఇలా...

- ఉదయం 10.15 గంటలకు మామునూరు విమానాశ్రయానికి ప్రధాని మోదీ రాక
- 10.30 గంటలకు: భద్రకాళి గుడి సందర్శన, పూజా కార్యక్రమాల నిర్వహణ
- 11 గంటలకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానానికి చేరుకుంటారు.
- 11–11.35 గంటల వరకు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు
- 11.45 గంటలకు: ఆర్ట్స్ కాలేజీలోని బహిరంగ సభా వేదిక వద్దకు రాక
- మధ్యాహ్నం 12.30 గంటలకు: సభా వేదిక నుంచి రోడ్డు మార్గాన మామునూరుకు ప్రయాణం
- 12.50 గంటలకు : మామునూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు
- 12.55 గంటలకు : హెలికాప్టర్ ద్వారా తిరిగి హైదరాబాద్‌కు పయనం

ప్రధాని రాక ఇలా..

రూట్‌–1 : ప్రధాని మామునూరు ఎయిర్‌పోర్టు నుంచి హనుమకొండ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానానికి చేరుకునేందుకు మామునూరు ఎయిర్ పోర్ట్ – నాయుడు పెట్రోల్ పంప్ జంక్షన్ – భద్రకాళి దేవాలయానికి వెళ్తారు. అక్కడ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం పోలీస్ కమిషనరేట్ జంక్షన్ – అదాలత్ జంక్షన్ నుంచి బహిరంగ సభ జరిగే ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజీకి చేరుకుంటారు.



తిరుగుపయనం..

రూట్‌–2: విజయ సంకల్ప సభ ముగిశాక ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీ నుంచి అదాలత్ జంక్షన్ – హంటర్ రోడ్డు – ఖమ్మం హైవే బ్రిడ్జ్ – నాయుడు పెట్రోల్ పంప్ సర్కిల్ నుంచి మామునూరు విమానాశ్రయానికి చేరుకుంటారు.



ఎయిర్‌పోర్ట్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి



మామునూరు: ప్రధాని మోదీ హెలికాప్టర్‌లో దిగే మామునూరు ఎయిర్‌పోర్టు వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. సువిశాలమైన రన్‌వేపై నాలుగు హెలికాప్టర్లు సులభంగా ల్యాండ్ అయ్యేందుకు వేర్వేరుగా హెలిపాడ్ నిర్మాణాలు చేపట్టారు. శుక్రవారం ఉదయం భద్రతా అధికారులు ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి మామునూరు విమానాశ్రయం వరకు భద్రత వాహనాలతో కూడిన మాక్ కాన్వాయ్ డ్రిల్ నిర్వహించారు. భద్రత, ఇతర ఏర్పాట్లను ఎస్పీజీ డీఐజీ నవనీత్ కుమార్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, బల్దియా కమిషనర్ రిజ్వాన్ బాషా పరిశీలించారు.

రాష్ట్రం నుంచి విధుల్లో 3,500 మంది పోలీసులు

వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం : ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని పర్యటన బందోబస్తుపై రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ సమీక్షించారని తెలిపారు. అదనపు డీజీపీ స్థాయి అధికారులు ఇక్కడే ఉండి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. బందోబస్తు విధుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 3,500 మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ఇద్దరు డీఐజీలు, 10 మంది డీసీపీలు, 10 మంది ఎస్పీలు, 15 మంది అదనపు డీసీపీలు, 32 మంది ఏసీపీలు, 56 మంది ఇన్‌స్పెక్టర్లు, 250 మంది ఎస్సైలతోపాటు గ్రేహౌండ్స్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని వెల్లడించారు.

మూడంచెల భద్రత..



ప్రధాన మంత్రి పర్యటనకు మూడంచెల భద్రత ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. మొదట స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ), రెండవ అంచెలో పారా మిలటరీ, గ్రేహౌండ్స్ బలగాలు ఉంటాయని, మూడవ అంచెలో లోకల్ పోలీస్ ఉంటుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రజలు సహకరించాలని, పాఠశాలల యాజమాన్యాలు ట్రాఫిక్ ఆంక్షలకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. హనుమకొండలోని అమరవీరుల స్తూపం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు ఎలాంటి వాహనాలకు అనుమతి లేదని తెలిపారు.

ప్రధాని పర్యటన చరిత్రాత్మకం..
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

సభకు ఇలా చేరుకోండి : సీపీ

చరిత్ర సృష్టించేలా.. ప్రధాని సభ
ఎంపీ బండి సంజయ్

ముందస్తు అరెస్టులు
కాంగ్రెస్ నాయకుల గృహ నిర్బంధం 8లో▸

అయోధ్యపురంలో ఫౌండేషన్ స్టోన్

కాజీపేట రూరల్: రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్, రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ప్రాజెక్ట్‌లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనుండడంతో కాజీపేట మండలం అయోధ్యపురం శివారులోని వ్యాగన్ స్థలం వద్ద ఫౌండేషన్ స్టోన్ ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. ఆర్ట్స్ కాలేజీలో జరిగే ప్రధాని సభకు, అయోధ్యపురంలోని వ్యాగన్ నిర్మాణ స్థలానికి సుమారు వెయ్యి మంది రైల్వే కార్మికులు తరలివెళ్లనున్నారు.

అతడికి పట్టా ఇవ్వకండి

- ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆదేశం



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న శ్రీను

కురవి: డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాల పంపిణీలో డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఓ యువకుడికి పట్టా ఇవ్వొద్దని అధికారులకు సూచించారు. వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్ తండా జీపీ పరిధి బోడతండాలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ఎమ్మెల్యే రెడ్యా పరిశీలించేందుకు వెళుతున్నాడు. ఈ క్రమంలో తండాకు చెందిన శ్రీను అనే యువకుడు ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవించారు. 2018లో డబుల్ బెడ్ రూం ఇళ్ల శంకుస్థాపనకు వచ్చారని, కాంట్రాక్టర్ ఇళ్లను అసంపూర్తిగా నిర్మించి వదిలేసి వెళ్లాడన్నారు. కాలనీలో విద్యుత్ స్తంభాలు లేవు, మిషన్ భగీరథ నీరు రావడం లేదని, రోడ్లు సరిగా లేవని ఏకరువు పెట్టాడు. దీంతో ఎమ్మెల్యే స్పందించి మీరే స్థలం చూసుకుంటే డబుల్ ఇళ్లు కట్టించా.. కాంట్రాక్టర్‌ను కూడా మీరే చూసుకున్నారన్నారు. భగీరథ నీటిని రెండు రోజుల్లో సరఫరా చేయాలని ఏఈ సుమన్, ప్రీతిలను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలకు నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో సమస్యలు ఉండగానే ఇళ్ల పట్టాలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించడంతో ఎమ్మెల్యే రెడ్యానాయక్ పట్టాలు తర్వాత ఇద్దామని తెలిపి వేరే తండాకు వెళ్లారు. అనంతరం బీల్యా నాయక్ తండాలో జరుగుతున్న సమావేశానికి బోడతండా లబ్ధిదారులు వెళ్లి డబుల్ పట్టాలు ఇవ్వాలని కోరగా ప్రశ్నించిన యువకుడు శ్రీనుకు మాత్రం పట్టా ఇవ్వొద్దని అధికారులకు సూచించారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి

తొర్రూరు రూరల్: తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహిస్తుందని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గోపాలగిరిలో ఏర్పాటు చేయనున్న ఆయిల్ పామ్ పరి శ్రమ స్థలాన్ని, అరిపిరాలలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ నర్సరీని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మానుకోట జిల్లా తొర్రూరు మండలంలోని గోపాలగిరిలో 45 ఎకరాల విస్తరణ స్థలంలో రూ.175 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పామ్ పరిశ్రమ స్థాపన, మరో రూ.75 లక్షలతో పహారిగోడ నిర్మాణానికి ఈనెల 14న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, నిరంజన్‌రెడ్డిలు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ పరిశ్రమను 2025 సంవత్సరం నాటికి పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డి, జీఎం సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ వెంకటనారాయణగౌడ్, రైతు మండల కోఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భగీరథ పంపుహౌస్ పరిశీలన

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరు ప్రభుత్వ బాలికల పాఠశాల దగ్గర మిషన్ భగీరథ పైప్‌లైన్ పగలడంతో నీరంతా వృథాగా పోయిన విషయం విదితమే. శుక్రవారం 'సాక్షి'లో భగీరథ నీరు వృథా అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణి స్పందించి భగీరథ పంపుహౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. భగీరథ నీరు పైప్‌లైన్ లీకేజీ కాకుండా ప్రతి రోజు సిబ్బంది పరిశీలించాలని, లీకేజీ, పైప్‌లు పలగడం ఎక్కడ కన్పించిన మరమ్మతు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సురేష్, మిషన్ భగీరథ అధికారులు, ఇంజనీర్లు, మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, నీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.



పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

గోరింటాకు సంబురం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్‌నగర్ కాలనీలో శుక్రవారం మహిళలు గోరింటాకు వేడుకను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పెద్దసంఖ్యలో హాజరై చేతులకు వివిధ ఆకృతుల్లో గోరింటాకు పెట్టుకుని పండిన చేతులను ఒకరికొకరు చూపించుకుంటూ మురిసిపోయారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు యుద్ధనపూడి గాయత్రి, లావణ్య, కాలనీ మహిళలు స్వరూప, సంధ్య, రమ్య, కవిత, మాధవి, రాజేశ్వరి, రమాదేవి, విజిత, అనూష, లక్ష్మి, కల్పన, కుసుమ, కోమనీల తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ..

నిరుద్యోగులను మోసగించిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

కేసముద్రం: విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు ఆశ చూపి, వారి వద్ద డబ్బులు వసూలు చేసి మోసగించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థ పేరున మెహదీపట్నం శివారు మహవీర్‌నగర్‌కాలనీకి చెందిన ఎండీ.ఫరూఖ్, రాజేంద్రనగర్ శివారు బుద్వేల్‌కి చెందిన దాసరి రిచర్డ్, మరో మహిళ కలిసి పోలాండ్ దేశంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కేసముద్రం మండలానికి చెందిన ఏడుగురు నిరుద్యోగులను నమ్మించారు. ఈమేరకు 4 నెలల క్రితం వారి వద్ద నుంచి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేశారు. ఆ తర్వాత ఉద్యోగం కోసం పలుమార్లు సంప్రదించగా దాటవేస్తూ వచ్చారు. తీరా ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసముద్రానికి చెందిన ఈగ శ్రీరామ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కి చెందిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మరో మహిళ పరారీలో ఉందన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: రెవెన్యూ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ అనుమతులు పొందని ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. పది లక్షలుపైగా చెల్లింపులు చేసే స్థలాల క్రమ బద్ధీకరణ చేసుకొని నిర్మాణాలు తక్షణం తొలగింపుపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జీఓ 59 కింద ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారికి నోటీసులు ఇచ్చామన్నారు. సంబంధిత నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించకుంటే నిర్మాణాలను సత్వరమే తొలగించేందుకు చర్యలు చేపడుతామన్నారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, ఆర్డీఓ కొమురయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్, అధికారులు

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

మన ఊరు మన బడి పాఠశాలలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మన ఊరు మన బడి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అభిలాష అభినవ్ మాట్లాడుతూ మరుగుదొడ్లు, డైనింగ్ హాల్, ఇతర పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు చేపట్టిన పాఠశాలల పురోగతి లిస్ట్‌ను, పాఠశాలల ఫొటోలతో నేడు సాయంత్రం లోగా అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్, డీఈఓ రామారావు, అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల అయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బాలురు 699 మంది విద్యార్థులకు 493 మంది, బాలికలు 570 మందికి 450 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. మొత్తం 1,269 మంది విద్యార్థులకు గాను 943 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రీకౌంటింగ్ కోసం రూ. 500 చొప్పున ఈ నెల 18 తేదీ వరకు ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు పాఠశాల హెచ్‌ఎంను సంప్రందించాలని డీఈఓ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీలో ..

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయని ఇంటర్ జిల్లా విద్యాశాఖ అధికారి సమ్మెట సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంటర్ జనరల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర బాలబాలికల విభాగంలో 3,436 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 2,010 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర బాలబాలికల విభాగంలో 913 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 424 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈసారి కూడా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో బాలికలదే పైచేయి అని తెలిపారు.

8 పోస్టులు.. 407 దరఖాస్తులు



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబాబాద్: జిల్లా సంక్షేమ శాఖ పరిధిలోని చైల్డ్ హెల్ప్ లైన్ విభాగంలో ఒక ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పోస్ట్, కౌన్సిలర్, మూడు చైల్డ్ సూపర్‌వైజర్లు, మూడు కేస్ వర్కర్ల పోస్ట్‌లకు 407 దరఖాస్తులు వచ్చాయని సీడీపీఓలు శిరీష, లక్ష్మి తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆ పోస్టులకు సంబంధించిన దరఖాస్తుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పోస్టుకు 44 దరఖాస్తులు, కౌన్సిలర్ పోస్ట్‌కు 23, మూడు సూపర్‌వైజర్ల పోస్టులకు 155, మూడు కేస్ వర్కర్ల పోస్ట్‌లకు 177 దరఖాస్తులు వచ్చాయన్నారు. గత నెల 24 నుంచి 28 వరకు దరఖాస్తుల స్వీకరణ పూర్తి కాగా ఈ నెల 1వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం దరఖాస్తుల పరిశీలనకు 140 మంది అభ్యర్థులు హాజరు కాగా వారి దరఖాస్తుల పరిశీలన పూర్తి అయిందన్నారు. అభ్యర్థుల జాబితా తయారు చేసిన అనంతరం కలెక్టర్ కె.శశాంక అధ్యక్షతన ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు వాహిణి, శ్రీలత, ప్రజ్వల పాల్గొన్నారు.

సున్నా నుంచి 70 శాతం ఉత్తీర్ణత

గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం హైస్కూల్లో గత మార్చి నెలలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో జీరో ఫలితాలు సాధించగా, శుక్రవారం సప్లిమెంటరీ ఫలితాల్లో విద్యార్థులు 70 శాతం ఉత్తీర్ణులైనట్లు పాఠశాల ఉపాధ్యాయుడు ఎం సుందర్‌కుమార్ తెలిపారు. మొత్తం 10 మంది విద్యార్థులు సప్లిమెంటరీలో పరీక్షలు రాయగా ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి మిగతా ముగ్గురు ఫెయిల్ అయినట్లు తెలిపారు. కాగా వేసవి సెలవుల్లో సైతం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

స్పాట్‌ అడ్మిషన్లకు ఈనెల 10, 11వ తేదీల్లో కౌన్సెలింగ్‌

● నేడు వాయిదా

ఏటూరునాగారం: మహబూబాబాద్‌, జయశంకర్‌ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్‌ అడ్మిషన్‌ కోసం ఈనెల 10, 11వ తేదీల్లో కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నట్లు గురుకుల కళాశాలల ఆయా జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త ఏవీ రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందు 8వ తేదీన స్పాట్‌ కౌన్సెలింగ్‌ తేదీ ప్రకటించామన్నారు. అయితే అనివార్య కారణాలతో వాయిదా పడిందన్నారు. ఈ కౌన్సెలింగ్‌ ఈ నెల 10వ తేదీన ఏటూరునాగారం బాలికల కళాశాలలో బాలికలకు, 11వ తేదీన బాలుర కళాశాలలో బాలురకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. టెన్త్‌లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్‌, కుల, ఆదాయం, నివాసం ధ్రువీకరణపత్రాలతోపాటు ఆధార్‌, పాస్‌ పోర్టు సైజ్‌ ఫొటోలతో హాజరు కావాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాల్లో కూడా సీట్లు భర్తీ చేస్తామన్నారు.

రామకృష్ణయ్య, సుభద్ర హత్య కేసుల్లో నలుగురి అరెస్ట్‌

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేటకు చెందిన రిటైర్డ్‌ ఎంపీడీవో రామకృష్ణయ్య, సదాశివపేటకు చెందిన గుండని సుభద్రను హత్య చేసిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై బండి శ్రావణ్‌ కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రిటైర్డ్‌ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్యను గత నెల 15వ తేదీన హత్య చేసిన కేసులో తిరుపతి, దండుగుల రాజును అరెస్టు చేశామన్నారు. అలాగే, 2022 అక్టోబర్‌ 20వ తేదీన స దాశివపేటలో గుండని సుభద్రను హత్య చేసిన కేసులో బూసనూరి రాజేశ్‌, పల్లపు నవీన్‌ను అరెస్టు చేశామన్నారు. ఈ నలుగురికి వైద్య పరీక్షలు చేయించిన అనంతరం రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా, ఈ రెండు హత్యలను జడ్పీ వైస్‌ చైర్‌ పర్సన్‌ గిరబోయిన భాగ్యలక్ష్మి భర్త అంజయ్య హత్య చేయించారు. హత్య చేయించిన అంజయ్య కూడా జైలులోనే ఉన్నాడు. ఈ హత్యలతో సంబంధం ఉన్న వారిని ఇప్పటి వరకు 12 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రధాని పర్యటన చరిత్రాత్మకం..

- తెలంగాణలో ఉద్యమకారుల ఆకాంక్ష మేరకు పాలన
- ఎయిర్‌పోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదు
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌ రెడ్డి

హన్మకొండ: కాకతీయులు పాలించిన ఓరుగల్లు గడ్డపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటించడం చరిత్రాత్మకమని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ తన పర్యటనలో వ్యాగన్‌ తయారీ పరిశ్రమతో పాటు రూ.5,500 కోట్లతో చేపట్టనున్న జాతీయ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేస్తారన్నారు. వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల మైదానికి చేరుకుంటారన్నారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేసి బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం.. కాజీపేటకు వ్యాగన్‌ తయారీ పరిశ్రమను మంజూరు చేస్తూ ఈ నెల 5న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మొదటి దశలో రూ.521 కోట్లతో పనులు చేపడుతారన్నారు. ఈ పరిశ్రమలో రోజుకు 7 వ్యాగన్లు, నెలకు 200, ఏడాదికి 2400 వ్యాగన్లు తయారవుతాయన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ సభ రాజకీయంగా కీలకమైందన్నారు. సోషల్‌ మీడియా ద్వారా బురదజల్లుతూ, కుట్రలు చేస్తున్నారని, వీటిని ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సభ ద్వారా కుటుంబ రాజకీయాలు, పాలనకు వ్యతిరేకంగా ఏమి చేస్తామో ప్రధాని మోదీ చెబుతారన్నారు. రాష్ట్రంలో తెలంగాణ అమరుల ఆకాంక్షల మేరకు పాలన, ప్రజాస్వామిక, అవినీతికి ఆస్కారం లేని పాలన తీసుకువస్తామన్నారు. కేంద్రం దేశంలో ఏడు టెక్స్‌టైల్స్‌ పార్కులు మంజూరు చేస్తే ఇందులో ఒక్కటి వరంగల్‌కు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించకపోవడంతో ప్రారంభం ఆలస్యమవుతుందన్నారు. అదేవిధంగా వరంగల్‌ ఎయిర్‌ పోర్టుకు స్థలం ఇవ్వాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రితో పాటు తాను స్వయంగా లేఖలు రాసినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదని విమర్శించారు. దేశంలో 175 ఎయిర్‌ పోర్టులు కాబోతున్నాయని ఇందులో వరంగల్‌ ఒక్కటి కావాలని కోరుకుంటున్నానన్నారు. ప్రధాని మోదీ బహిరంగ సభకు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, జిల్లా ఇన్‌చార్జ్‌ వి.మురళీధర్‌ గౌడ్‌, నాయకులు మార్తినేని ధర్మారావు, ఏనుగుల రాకేశ్‌ రెడ్డి, వన్నాల శ్రీరాములు, చాడ శ్రీనివాస్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'గౌతమి' ఘటనను గుర్తుచేసిన 'ఫలక్‌నుమా'

- యాదాద్రి భువనగిరి జిల్లాలో రైలుకు షార్ట్‌సర్క్యూట్‌
- ఐదు బోగీలు దగ్ధం
- అప్రమత్తమైన ప్రయాణికులు..
- తప్పిన పెనుప్రమాదం


షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమవుతున్న ఫలక్‌నుమా రైలు

కాజీపేట రూరల్‌: యాదాద్రి భువనగిరి జిల్లా పగిడిపల్లి–బొమ్మాయిపల్లి స్టేషన్ల మధ్య శుక్రవారం ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో షార్ట్‌ సర్క్యూట్‌ సంభవించి ఐదు బోగీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన 16 ఏళ్ల నాటి గౌతమి ఎక్స్‌ప్రెస్‌ ఘటనను గుర్తు చేసింది. 2007 జూలై 31వ తేదీ అర్ధరాత్రి కేసముద్రం–తాళ్ల పూసపల్లి రైల్వే స్టేషన్ల మధ్య సికింద్రాబాద్‌ నుంచి కాకినాడ వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో షార్ట్‌ సర్క్యూట్‌ సంభవించి 4 బోగీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో గాఢనిద్రలో ఉన్న 27 మంది ప్రయాణికులు మృతి చెందారు. కాగా, శుక్రవారం జరిగిన ఘటనలో వెంటనే అప్రమత్తమైన లోకోపైలెట్లు ఫలక్‌నుమా రైలును నిలిపి వేయగా ప్రయాణికులు కిందిదిగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. కాగా, 16 ఏళ్ల నాటి గౌతమి ఎక్స్‌ప్రెస్‌ ఘటన మరువక ముందే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌ ఘటన జరగడంపై ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.

'ఫలక్‌నుమా' ఘటనతో పలు రైళ్ల మళ్లింపు

కాజీపేట జంక్షన్‌, వరంగల్‌ మీదుగా శుక్రవారం పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారి మళ్లించి నడిపించారు. పగిడిపల్లి–బొమ్మాయిపల్లి స్టేషన్ల మధ్య జరిగిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌ ఘటనతో సికింద్రాబాద్‌ నుంచి వయా మిర్యాలగుడ, పిడుగురాళ్ల మీదుగా గుంటూరు డివిజన్‌ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను దక్షిణమధ్య రైల్వే అధికారులు వయా వరంగల్‌, కాజీపేట మీదుగా దారి మళ్లించి నడిపించారు.

దారి మళ్లించిన రైళ్ల వివరాలు..

సికింద్రాబాద్‌–హౌరా (12704) ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట, విజయవాడ మీదుగా, విశాఖపట్నం–లింగంపల్లి (12805) ఎక్స్‌ప్రెస్‌ కాజీపేట మీదుగా, నర్సాపూర్‌–నాగర్‌సోల్‌ (17231) ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ, కాజీపేట మీదుగా దారి మళ్లించారు. సికింద్రాబాద్‌–ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను కూడా కాజీపేట మీదుగా దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు

నెక్కొండ: వేర్వేరు ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్‌ జానీపాషా తెలిపారు. మండలంలోని చంద్రుగొండకు చెందిన పోకల లక్ష్మి తన భర్త మునీశ్వర్‌తో కలిసి శుక్రవారం వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామ బొడ్రాయి వద్ద చంద్రుగొండ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య మార్గమధ్యలో వారిని ఆపి అకారణంగా మహిళను దూషించారు. ఇరువురు మధ్య గొడవ కారణంగా కోపోద్రిక్తులైన సూరయ్యతోపాటు సంగని రాజు, సంగని చిన్న వీరయ్య, సిరిపోతుల సురేశ్‌, ఎగ్గడి వీరన్న.. లక్ష్మి, మునీశ్వర్‌పై దాడి చేసి, చంపుతానని బెదిరించారు. ఈ విషయంపై లక్ష్మి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే, అదే గ్రామానికి చెందిన మాంకాల మణి.. తనతో అకారణంగా గొడవకు దిగి కులం పేరుతో దూషించారని లక్ష్మి, మునీశ్వర్‌పై ఫిర్యాదు చేయగా వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తేలుకాటుతో రైతు మృతి


ఆంజనేయులు (ఫైల్‌)

దేవరుప్పుల : తేలుకాటుతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రంలోని కొత్తకాలనీకి చెందిన రైతు లొడంగి ఆంజనేయులు(30) ఖరీఫ్‌ సాగు పనుల కోసం తన వ్యవసాయక్షేత్రం వద్దకు వెళ్లాడు. దుక్కిదున్నడానికి పాతడ్రెస్‌ వేసుకొని సాగు పనుల్లో నిమగ్నమవగా అందులో ఉన్న తేలు కాటు వేసింది. దీంతో రైతు అరుపు విన్న చుట్టుపక్కల రైతులు వెంటనే పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆంజనేయులు మృతి చెందాడు.

అన్న మరణం తట్టుకోలేక..

● తమ్ముడి ఆత్మహత్య


రాజమౌళి (ఫైల్‌)

హసన్‌పర్తి: అన్న మరణం తట్టుకోలేక తమ్ముడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాకతీయ యూనివర్సిటీ పీఎస్‌ పరిధి పెగడపల్లిలో జరిగింది. పెగడపల్లికి చెందిన వైనాల రాజమౌళి(42), సంపత్‌ సోదరులు. ఇటీవల పెద్దన్న సంపత్‌ మృతి చెందాడు. దీనిపై అప్పటి నుంచి రాజమౌళి.. తన అన్న మరణం తట్టుకోలేకపోయాడు. దీంతో గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ముందస్తు అరెస్టులు


టేకులగూడెంలోని స్వగృహంలో డీసీసీబీ మాజీ చైర్మన్‌ జంగా రాఘవరెడ్డితో పోలీసులు

వరంగల్‌ / మడికొండ / కాజీపేట / కేయూ క్యాంపస్‌ / హసన్‌పర్తి: ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నగర పర్యటన సందర్భంగా ప్రతిపక్షాల నేతలను పోలీసులు ముందుస్తు శుక్రవారం అరెస్టు చేయడంతో పాటు మరికొంత మందిని గృహ నిర్బంధం చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం హనుమకొండలో కాంగ్రెస్‌ నేతలు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, జంగా రాఘవరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్‌ తదితరులను గృహ నిర్బంధం చేశారు. మహిళా కాంగ్రెస్‌ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, సంపత్‌ యాదవ్‌ దంపతులను గృహ నిర్బంధం చేశారు. టేకులగూడెంలోని స్వగృహంలో డీసీసీబీ మాజీ చైర్మన్‌ జంగా రాఘవరెడ్డిని మడికొండ పోలీసులు హౌస్‌ అరెస్టు చేశారు. కాజీపేట రైల్వే జేఏసీ నాయకులను మడికొండ పోలీసులు అదుపులోకి తీసుకుని పీటీసీకి తరలించారు. అరెస్టయిన వారిలో రైల్వే జేఏసీ కన్వీనర్‌ దేవులపల్లి రాఘవేందర్‌, చైర్మన్‌ కొండ్ర నర్సింగరావు, కోకన్వీనర్లు అనుముల సంతోష్‌కుమార్‌, అనుముల శ్రీనివాస్‌, రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ డివిజన్‌ పోరాట సమితి నాయకుడు కర్ర యాదవరెడ్డి తదితరులు ఉన్నారు. జాతీయ విద్యార్థి నేత వినోద్‌ లోక్‌నాయక్‌ హనుమకొండలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, అతని వద్దకు పోలీసులు వెళ్లి అరెస్టుకు యత్నించారు. బీఎస్పీ వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు చాతళ్ల వేణుగోపాల్‌, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఓంకార్‌, సీపీఐ నాయకుడు లింగారెడ్డి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు దయాకర్‌, మైకేల్‌ను హసన్‌పర్తి పోలీసులు ముందుస్తు అరెస్ట్‌ చేశారు. అలాగే, విద్యార్థి సంఘాల నేతలను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్ట్‌ చేశారు. అరెస్టయిన వారిలో తెలంగాణ విద్యార్థి పరిషత్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్‌, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీశ్‌, ప్రజాసంఘాల నేతలు పోరిక ఈశ్వర్‌సింగ్‌, భూక్యా రాజునాయక్‌ ఉన్నారు.

టౌన్‌ప్లానింగ్‌ పరీక్ష అభ్యర్థులు అలర్ట్‌..

నేడు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

● వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ ఏవీ.రంగనాథ్‌

వరంగల్‌ క్రైం : తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ శనివారం నిర్వహిస్తున్న టౌన్‌ ప్లానింగ్‌ పరీక్షకు నగరంలో 3 వేల మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. వారంతా ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని వరంగల్‌ సీపీ ఏవీ రంగనాథ్‌ సూచించారు. హనుమకొండ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల మైదానంలో జరుగనున్న ప్రధాని మోదీ బహిరంగ సభ సందర్భంగా ట్రాఫిక్‌ ఆంక్షలు విధించామన్నారు. ఈ సందర్భంగా నగరంలో ఎక్కడైనా అభ్యర్థులు ఇబ్బందులకు గురైతే అక్కడ విధుల్లో ఉన్న పోలీస్‌ సిబ్బందికి హాల్‌టికెట్లు చూపిస్తే సాయం చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్ష ముగిసిన తర్వాత కూడా అభ్యర్థులు త్వరగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

ప్రధాని సభకు ఇలా చేరుకోండి..


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రంగనాథ్‌

వరంగల్‌ క్రైం : హనుమకొండ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల మైదానంలో జరిగే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభకు వాహనాలు ఈ మార్గాల మీదుగా రావాల్సి ఉంటుంది.ఈ మేరకు కమిషనరేట్‌ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ ఏవీ రంగనాథ్‌ పార్కింగ్‌ సభకు చేరుకునే మార్గాలను మీడియాకు వివరించారు.

- హుజూరాబాద్‌ వైపు నుంచి వచ్చే వాహనాలు కేయూసీ జంక్షన్‌, 100 ఫీట్ల రోడ్డు మీదుగా సెయింట్‌ పీటర్స్‌ ఫార్మసీ కాలేజీ, అబేండ్కర్‌ భవన్‌, గోకుల్‌ జంక్షన్‌ మీదుగా సుబేదారి పీఎస్‌ వద్ద ప్రజలను దించాలి. ఖాళీ వాహనాలు ఇదే మార్గంలో తిరిగి వెళ్లి కేయూ ఎస్డీఎల్సీఈ మైదానంలో పార్కింగ్‌ చేయాల్సి ఉంటుంది.
- పరకాల, భూపాలపల్లి, ములుగు నుంచి వచ్చే వాహనాలు పెద్దమ్మగడ్డ డైవర్షన్‌ నుంచి కేయూసీ జంక్షన్‌, 100 ఫీట్ల రోడ్డు మీదుగా సెయింట్‌ పీటర్స్‌ ఫార్మసీ కాలేజీ, అబేండ్కర్‌ భవన్‌, గోకుల్‌ జంక్షన్‌ మీదుగా సుబేదారి పోలీస్‌ స్టేషన్‌ వద్ద ప్రజలను దించాలి. ఖాళీ వాహనాలు ఇదే మార్గంలో తిరిగి వెళ్లి కేయూ ఎస్డీఎల్సీఈ మైదానంలో పార్కింగ్‌ చేయాల్సి ఉంటుంది.
- నర్సంపేట వైపు నుంచి వచ్చే వాహనాలు వెంకట్రామ జంక్షన్‌, పోచమ్మమైదాన్‌ జంక్షన్‌, దేశాయిపేట 80 ఫీట్ల రోడ్డు, ఆటోనగర్‌, హనుమాన్‌ జంక్షన్‌, పెద్దమ్మగడ్డ, కేయూ జంక్షన్‌, 100 ఫీట్ల రోడ్డు మీదుగా సెయింట్‌ పీటర్స్‌ ఫార్మసీ కాలేజీ, అబేండ్కర్‌ భవన్‌, గోకుల్‌ జంక్షన్‌ మీదుగా సుబేదారి పోలీస్‌ స్టేషన్‌ వద్ద ప్రజలను దించాలి. ఖాళీ వాహనాలు ఇదే మార్గంలో తిరిగి వెళ్లి కేయూ ఎస్డీఎల్సీఈ మైదానంలో పార్కింగ్‌ చేయాల్సి ఉంటుంది.
- పై మూడు మార్గాల నుంచి వచ్చే వాహనాలు ఉదయం 9.30 గంటలలోపు సుబేదారి పోలీస్‌ స్టేషన్‌ వద్దకు చేరుకోవాలి. తర్వాత వచ్చే వాహనాలను కేయూసీ జంక్షన్‌ వరకు మాత్రమే అనుమతిస్తారు.
- వర్ధన్నపేట నుంచి వచ్చే వాహనాలు పున్నేలు క్రాస్‌, ఐనవోలు, కరుణాపురం మడికొండ, కాజీపేట మీదుగా ఫాతిమా జంక్షన్‌ వద్ద ప్రజలను దించాలి. ఖాళీ వాహనాలను సెయింట్‌ గ్యాబ్రియల్‌ స్కూల్‌ మైదానంలో పార్కింగ్‌ చేయాల్సి ఉంటుంది.
- స్టేషన్‌ఘన్‌పూర్‌ ఆపై మార్గాల నుంచి వచ్చే వాహనాలు కరుణాపురం మడికొండ, కాజీపేట మీదుగా ఫాతిమా జంక్షన్‌ వద్ద ప్రజలను దించాలి. ఖాళీ వాహనాలను సెయింట్‌ గ్యాబ్రియల్‌ స్కూల్‌ మైదానంలో పార్కింగ్‌ చేయాలి. ట్రాఫిక్‌ ఆంక్షలు ఉదయం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమలులో ఉంటాయి.
- ట్రాఫిక్‌ మళ్లింపు, ఆంక్షలు ఉన్నందున ప్రజలు అవసరం ఉంటే తప్ప తమ వాహనాలను రోడ్ల పైకి తీసుకురావొద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

చరిత్ర సృష్టించేలా.. ప్రధాని బహిరంగ సభ

● బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌


మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌

హన్మకొండ : హన్మకొండలో నేడు జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభను కనీవినీ ఎరగని రీతిలో సక్సెస్‌ చేసి చరిత్ర సృష్టించాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి హనుమకొండ దీన్‌దయాల్‌నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభల్లో కొందరు బీఆర్‌ఎస్‌ నేతలు పెయిడ్‌ ఆర్టిస్టులతో ప్రచారం చేసుకుంటున్నారన్నారు. బీజేపీ కార్యకర్తలు క్రమశిక్షణ కలిగిన వారని, ఎలాంటి నినాదాలు లేకుండా సభను విజయవంతం చేయాలన్నారు. కరీంనగర్‌–వరంగల్‌ జాతీయ రహదారి విస్తరణకు రూ.2146 కోట్లు కేటాయించారని, దీనిపై తానే కరీంనగర్‌లోనే బహిరంగ సభ పెట్టొచ్చన్నారు. కానీ చారిత్రక వరంగల్‌కు ఈ అవకాశం వచ్చిందన్నారు సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఇన్‌చార్జ్‌ వీ మురళీధర్‌ గౌడ్‌, నాయకులు మార్తినేని ధర్మారావు, కొరబోయిన సాంబయ్య, కందగట్ల సత్యనారాయణ, కార్పొరేటర్లు చాడ స్వాతి, గుజ్జుల వసంత పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి..

వరంగల్‌ చౌరస్తా : ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయంతం చేయాలని కోరుతూ శుక్రవారం బీజేపీ శ్రేణులు వరంగల్‌ తూర్పు నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించాయి. హన్మకొండ హంటర్‌ రోడ్డు మీదుగా వరంగల్‌ అండర్‌ బ్రిడ్జి, స్టేషన్‌ రోడ్డు, ఆర్టీసీ బస్‌ స్టేషన్‌ వరకు నిర్వహించిన ప్రచారంలో కరీంనగర్‌ ఎంపీ బండి సంజయ్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనే స్వయంగా జీపు నడుపుతూ ప్రజలకు అభివాదం చేశారు. కాగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్ర బెల్లి ప్రదీప్‌ రావు, కే సతీశ్‌, జీ రవికుమార్‌, వీ వెంకటరమణ వేర్వేరుగా ప్రచారం నిర్వహించారు.

కేయూలో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు


పరీక్షను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్‌ శ్రీనివాస్‌రావు


కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల పీహెచ్‌డీ పరిశోధకులకు శుక్రవారం ప్రీ పీహెచ్‌డి పరీక్షలు నిర్వహించారు. సోషల్‌ సైన్సెస్‌, సైన్స్‌, ఇంజనీరింగ్‌, ఆర్ట్స్‌ విభాగాల్లో 49 మంది పీహెచ్‌డీ పరిశోధకులు పరీక్షలకు హాజరయ్యారని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి,అదనపు పరీక్షల నియంత్రణాధికారి జ్యోతి తెలిపారు. కేయూ రిజిస్ట్రార్‌ శ్రీనివాస్‌రావు.. ఫార్మసీ కళాశాలలో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.

నాలుగో సెమిస్టర్‌ పరీక్షల్లో ఒకరు డీబార్‌

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్‌ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఖమ్మం ప్రియదర్శిని కళాశాల పరీక్ష కేంద్రంలో కాపీయింగ్‌ చేస్తూ పట్టుబడిన ఒక విద్యార్థిని డీబార్‌ను చేసినట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి జ్యోతి తెలిపారు.

అన్నను పొడిచి చంపిన తమ్ముడు..

- భూమి విషయంలో ఘర్షణ
- ఇప్పగూడెం గ్రామంలో ఘటన


చంటి మృతదేహం

వాజేడు: తల్లిదండ్రుల ద్వారా సంక్రమించిన ఎకరం భూమి విషయంలో తలెత్తిన గొడవ.. ఒకరిని బలితీసుకుంది. భూమి మొత్తం తనకే కావాలని, దానిని అమ్ముకుంటానని అన్న.. తమ్ముడితో గొడవకు దిగాడు. దీంతో ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో తమ్ముడు.. అన్నను కత్తితో పొడిచి చంపాడు. ఈ ఘటన గురువారం రాత్రి ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెం గ్రామంలో జరిగింది. ఎస్సై అశోక్‌ కథనం ప్రకారం గ్రామానికి చెందిన మొడెం రాములు, దుర్గ దంపతులకు ముగ్గురు సతానం. ఇందులో ఇద్దరు కొడుకులు ఉండగా తనకున్న ఎకరం భూమిని చెరో అరెకరం తీసుకోమని కొడుకులకు చెప్పాడు. చిన్న కొడుకు శివాజీ సరేనని ఒప్పుకున్నప్పటికీ పెద్దకుమారుడు మొడెం చంటి(36) మాత్రం తనకు ఇస్తున్న అరెకరం భూమితో పాటు తన తమ్ముడి భూమిని కూడా కావాలని, దీనిని అమ్ముకుంటానని చెప్పాడు. భూమిని అమ్మడం నచ్చని శివాజీ.. మనద్దరికి పిల్లలు ఉన్నారని, అలా చేయడం సరికాదని నచ్చజెప్పాడు. భవిష్యత్తులో పిల్లలకు ఉపయోగపడుతుందని బతిమిలాడాడు. తమ్ముడు మాటలు నచ్చని చంటి.. బయటకు వెళ్లి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అనంతరం తమ్ముడితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆవేశానికి గురైన శివాజీ.. కత్తితో అన్నను పొడవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.

ఛత్తీస్‌గఢ్‌లో ఉంటున్న మృతుడు

మృతుడు చంటి.. 15 సంవత్సరాల నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌ జిల్లా ముర్‌దొండి గ్రామంలో ఉంటున్నాడు. ఎనిమిది సంవత్సరాల క్రితం అక్కడే సీమ అనే యుతిని పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు సంతానం. నాలుగు సంవత్సరాల క్రితం ఒక కేసులో అక్కడి పోలీసులు చంటిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించగా బెయిలుపై బయటకు వచ్చాడు. కాగా, నాలుగు నెలల క్రితం భార్యతో గొడవ పడి ఆమెను గాయపర్చాడు. భార్య ఆస్పత్రిలో ఉండగానే అక్కడి నుంచి చిన్న కొడుకుతో కలిసి ఇప్పగూడెం వచ్చి తన తల్లి దండ్రులతో ఉంటున్నాడు. నిత్యం మద్యం సేవించి తల్లిదండ్రులు, తమ్ముడుతో ఘర్షణ పడేవాడు. ఈ క్రమంలోనే అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో చంటి మృతి చెందాడు. కాగా, ఈ ఘటనపై మృతుడి భార్య సీమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, చంటి తల్లిదండ్రులకు గుమ్మడి దొడ్డి సర్పంచ్‌ జయలక్ష్మి ఆర్థిక సాయం అందించారు. అత్యవసర ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేసినట్లు ఆమె తెలిపారు.